క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కాగజ్‌నగర్‌రూరల్: మండల పరిషత్ సమావేశ హాల్‌లో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు అర్హత మార్కులు తగ్గించాలి

కెరమెరి: ఇటీవల విడుదలైన టెట్ ఫలితాల్లో ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు అర్హత మార్కులు 70కు తగ్గించాలని మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుజాయత్ ఖాన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్ కోటా విద్యార్థులకు అర్హత మార్కులు 90గా ఉండడంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టిన ఎస్సై


రోడ్డు మరమ్మతులు చేయిస్తున్న ఎస్సై రమేశ్

సిర్పూర్(టి): సిర్పూర్(టి) -కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలో వేంపల్లి రైల్వేగేటు వద్ద గుంతలమయంగా మారిన రోడ్డుకు సోమవారం రాత్రి ఎస్సై దీకొండ రమేశ్ మరమ్మతులు చేయించారు. వాహనదారులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా మరమ్మతు చేయించినట్లు ఆయన పేర్కొన్నారు.

5 నుంచి ఎస్ఏ-1 పరీక్షలు

కెరమెరి: ఈ నెల 5 నుంచి 11 వరకు ఎస్ఏ 1 (సమ్మెటివ్ అసెస్‌మెంట్) పరీక్షలు నిర్వహించాలని మండల విద్యాధికారి కుడ్మెత సుధాకర్, మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు బుధవారం స్వాధీనం చేసుకోవాలని సూచించారు.

జీపీ భవనానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న నాగేశ్వర్ రావు

ఆసిఫాబాద్‌రూరల్: పరిపాలన సౌలభ్యం కోసం నూతన గ్రామ పంచాయతీలకు జీపీ భవనాలు నిర్మిస్తున్నట్లు జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. మంగళవారం మండలంలోని మాలన్‌గొంది, బలంపూర్ గ్రామ పంచాయతీల్లో నూతన భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, సర్పంచ్ శ్రీనివాస్, బాపురావు, భీమేశ్, జంగు, లింగు తదితరులు ఉన్నారు.

పెయింటింగ్ పోటీలు


విజేతలను అభినందిస్తున్న ఎఫ్ఆర్‌వో

కెరమెరి: మండలంలోని మోడి గ్రామంలో ఉన్న కేజీబీవీలో మంగళవారం అటవీశాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థినులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎఫ్ఆర్‌వో మజారోద్దీన్ తెలిపారు. 20 మంది విద్యార్థినులు పోటీల్లో పాల్గొనగా యోగితా, పద్మలు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో రామయ్య, ఎస్‌వో మీనాకుమారి తదితరులు ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు

కాగజ్‌నగర్‌టౌన్: ఎస్ఎఫ్ఐ కుమురంభీం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సభ్యులు కాగజ్‌నగర్‌లోని బీసీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ హాస్టల్ కమిటీ వేసి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

కాగజ్‌నగర్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పేర్కొన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ పెట్రోల్ పంప్‌లోని సహాయక కార్మిక అధికారి కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ పాత విధానంలోనే లేబర్ బోర్డు గుర్తింపు కార్డు, బీమా, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు.

ఇక ఆటలు షురూ..!


క్రికెట్ కిట్‌లోని క్రీడా సామగ్రి

- మండలంలో 93 క్రీడాప్రాంగణాలు
- నేడు 94 కిట్లు పంపిణీ

కెరమెరి: గ్రామీణ ప్రాంతాల్లోని యువకులను క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం దాదాపు అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు నిర్మించింది. ఏడాది క్రితం వాటిని నిర్మాణం పూర్తి కాగా క్రీడాపరికరాలు లేకపోవడంతో క్రీడాకారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం ఇటీవల క్రీడా సామగ్రి పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే మండల కేంద్రానికి క్రీడాకిట్లను సరఫరా చేసింది. ఆయా గ్రామాలకు చెందిన క్రీడా కిట్లను నేడు సంబంధిత సర్పంచ్‌లకు అందజేయనున్నారు.

93 గ్రౌండ్లు.. 94 కిట్లు..

మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన 93 క్రీడా ప్రాంగణాలకు 94 రకాల కిట్లు మంజూరయ్యాయి. వీటిలో క్రికెట్ కిట్లు 94, వాలీబాల్ 94, సైకిల్ పంప్ 94, డంబెల్స్ 94, టెన్నికాయిట్స్ (రింగ్స్) 94, స్కిప్పింగ్ రోప్ 94, ప్లాస్టిక్ విజిల్ 94, టీ షర్టులు 7050 ఉన్నాయి. అందులో ఒక్కో క్రికెట్ కిట్ ఖరీదు రూ.50 వేలు ఉండడం గమనార్హం.

కిట్లలోని సామగ్రి..

డంబుల్స్ : 2.5, 5, 7.5 కిలోలు మూడు సెట్లు
వాలీబాల్ : సింథటిక్ నెట్, సైకిల్ పంపు, బ్యాగ్
క్రికెట్ : రెండు బ్యాట్లు, రెండు జతల బ్యాటింగ్ గ్లౌజులు, లెగ్ ప్యాడ్లు, గార్డులు, వికెట్ కీపింగ్ గ్లౌజులు, ఆరు ప్రాక్టీస్ బంతులు, వికెట్ల సెట్
టీషర్టులు : 7050
డిస్కస్ త్రో: ఆరు టెన్నికాయిట్ రింగులు, నాలుగు స్కిప్పింగ్ రోప్‌లు

నేడు క్రీడా సామగ్రి పంపిణీ

చింతలమానెపల్లి: మండలంలోని క్రీడాకారులకు బుధవారం క్రీడా సామగ్రి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బాలాజీ అనుకోడ రైతు వేదికలో మధ్యాహ్నం 3గంటలకు తెలంగాణ ప్రభుత్వం ద్వారా మంజూరైన క్రీడాసామగ్రిని క్రీడాకారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు తమ పంచాయితీల పరిధిలో క్రీడాకారులకు సమాచారం అందించి క్రీడాకారులు సకాలంలో కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని సూచించారు.

క్రీడాకారులతో రావాలి



మండల కేంద్రంలో బుధవారం క్రీడా పరికరాలు పంపిణీ చేయనున్నాం. ఇప్పటికే ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు సమాచారం అందించాం. క్రీడాకారులతో రావాలని సూచించాం. ఒక్కో గ్రామ పంచాయతీకి మూడు కిట్లను అందిస్తాం. యువకులు సద్వినియోగం చేసుకోవాలి.

– మహేందర్, ఎంపీడీవో, కెరమెరి

మండలంలోని 115 గ్రామాల్లో 2136 మంది వరకు క్రీడాకారులు ఉన్నారు. ఒక్కో గ్రామ పంచాయతీకి 3 కిట్ల చొప్పున ఇవ్వనున్నారు. దీంతో ఇన్నాళ్లు ఆట పరికరాలు, క్రీడాకారులు లేక వెలవెలబోయిన క్రీడాప్రాంగణాలకు కొత్త శోభ రానుంది.

అడవి పందుల స్వైరవిహారం

- పంటలపై దాడులు
- తీవ్రంగా పంట నష్టం
- రక్షణకు అన్నదాతల పాట్లు


అడవి పందుల దాడిలో దెబ్బతిన్న పత్తి పంట

పెంచికల్‌పేట్: ఆరుగాలం కష్టపడి సాగు చేస్తున్న పంటలను రక్షించుకోవడానికి అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. వానాకాలంలో రైతులు సాగు చేసిన పత్తి, వరి పంటలు చేతికొచ్చే సమయంలో రాత్రిపూట అడవి పందులు దాడులు చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గుంపులుగా వచ్చి పంట పొలాలపై దాడులు చేస్తూ పొట్ట దశలో ఉన్న వరి పంటను, పత్తి పంటలోని కాయలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో వందల ఎకరాల్లో పంటలు పందుల దాడిలో నాశనమవుతున్నాయి. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలను రక్షించుకోవడానికి అన్నదాతలు రాత్రి వేళల్లో జాగారం చేస్తున్నారు.

మండలంలో..

మండలంలో సుమారు 12వేల ఎకరాల్లో పత్తి పంట, 5 వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. వరి పంట పొట్టదశలో ఉండటంతో అటవీప్రాంతం నుంచి పందులు పంట చేలలోకి గుంపులుగా వచ్చి దాడులు చేస్తున్నాయి. అడవి పందుల నుంచి పంటలను కాపాడుకోవడానికి అన్నదాతలు పంట చేల చుట్టూ పాత చీరలు, వైర్లు, మంటలు పెడుతున్నా పందులు బెదరడం లేదు. ప్రతీరోజు పంటలపైన దాడులు చేస్తుండటంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

అందని నష్టపరిహారం..

పందుల దాడుల్లో నష్టపోయిన రైతులు ఫొటోలతో అటవీశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, పందులకు ఎలాంటి హాని తలపెట్టవద్దని అటవీశాఖ అధికారులు గ్రామాల్లో హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీంతో కళ్ల ముందే పంటలను నష్టపోతున్నా అధికారులు కేసులు నమోదు చేస్తారనే భయంతో రైతులు పందులకు అపాయం కలిగించడం లేదు. ప్రతీ సంవత్సరం పందులతో పంటలు నష్టపోతున్నా అటవీశాఖ అధికారులు నష్టపరిహారం చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

పందులతో తీవ్ర నష్టం



రాత్రిపూట అడవి పందులు గుంపులుగా దాడులు చేస్తున్నాయి. పంటలను కాపాడుకోవడానికి రాత్రి సమయంలో పంట చేలలోనే కాపలా ఉంటున్నాం. అయినా పందుల దాడులు తగ్గడం లేదు. పందుల కారణంగా పంటలను తీవ్రంగా నష్టపోతున్నాం.

– రాజన్న, రైతు, కొత్తగూడ

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

అడవి పందులు పంటలపై దాడులు చేస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. స్థానికంగా ఉన్న అటవీశాఖ అధికారులతో సర్వే నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తాం. వారి ఆదేశాల మేరకు అడవి పందుల కట్టడికి చర్యలు తీసుకుంటాం.

– వేణుగోపాల్, ఫారెస్టు రేంజ్ అధికారి, పెంచికల్‌పేట్

వైద్యులను వెంటనే నియమించాలి


ఆందోళన చేస్తున్న గిరిజన నాయకులు

జైనూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను నియమించాలని గిరిజన నాయకులు మంగళవారం స్థానిక ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి రోగులు వస్తే ఒక్కరే వైద్యుడు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఐటీడీఏ పీవో ప్రత్యేక చొరవ తీసుకొని ఆసుపత్రికి సిబ్బందిని నియమించాలన్నారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ గణేశ్, కనక రాంజీ తదితరులు పాల్గొన్నారు.

సొంత డబ్బుతో రోడ్డుకు మరమ్మతు


సీసీరోడ్డుకు మరమ్మతులు చేస్తున్న యువకులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి గ్రామంలోని పెర్కవాడలో బీజేపీ నాయకుడు కుందారపు సుమన్ సొంత డబ్బుతో మంగళవారం సీసీరోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. సీసీరోడ్డు పగుళ్లు తేలి వాహనదారులు ఇబ్బందులకు గురవుతుండటంతో స్పందించిన సుమన్ మరమ్మతు చేయించారు. బాబురావు, శ్రీనివాస్, రవి, సత్యనారాయణ, ఇప్పకృష్ణ, గంగారాం, వరుణ్, దర్శన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం'


పార్టీలో చేరిన వారితో హరీశ్‌బాబు

కౌటాల: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మంగళవారం కౌటాలకు చెందిన లెండుగూ శంకర్, పెందోర్ బండు, పలువురు కాగజ్‌నగర్ పట్టణంలో బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్‌కు అవకాశం ఇవ్వాలన్నారు. నాయకులు బండి రాజేందర్‌గౌడ్, చందు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కౌటాల: మండల కేంద్రంలోని బుద్ధవిహార్‌లో మంగళవారం ఫొటో ఎక్స్‌పో పోస్టర్లను ఎంపీపీ విశ్వనాథ్ ఆవిష్కరించారు. గ్రామీణ ఫొటోగ్రాఫర్లు నైపుణ్యాలు పెంచుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. ఈ నెల 6, 7, 8వ తేదీల్లో హైదరాబాద్‌లో కార్యక్రమం ఉంటుందన్నారు. సంఘం అధ్యక్షుడు వగాడి జీవన్, సభ్యులు శ్రీనివాస్, నాందేవ్, నాగేశ్, రాజు, జితేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్ తహసీల్దార్‌గా భువనేశ్వర్


బాధ్యతలు స్వీకరిస్తున్న భువనేశ్వర్

బెజ్జూర్: మండల నూతన తహసీల్దార్‌గా భువనేశ్వర్ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీ పాల్ రెడ్డి నెలరోజుల క్రితం బదిలీపై వెళ్లారు. కాగా నెన్నెల తహసీల్దార్‌గా ఉన్న భువనేశ్వర్‌ను బెజ్జూర్‌కు బదిలీ చేశారు.

5కే రన్ పోస్టర్ విడుదల


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు


సిర్పూర్(టి): కాగజ్‌నగర్ పట్టణంలో ఈనెల 15న నిర్వహించనున్న 5కే రన్ కార్యక్రమం పోస్టర్లను మంగళవారం ఫిట్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు ఎస్సై దీకొండ రమేశ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉదయం 6 గంటలకు పట్టణంలోని ఓల్డ్ చెక్ పోస్టు నుంచి రన్ ప్రారంభమవుతుందన్నారు. ఫిట్ ఇండియా సభ్యులు సుగుణాకర్, సురేశ్, ధన్‌రాజ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న విశ్వనాథ్

కౌటాల: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీలకు క్రీడాసామగ్రి పంపిణీ చేశారు. ఎంపీడీవో నస్రుల్లాఖాన్, సర్పంచులు మౌనిశ్, రమేశ్, శ్రీనివాస్, రేణుక, నాయకులు మధుకర్, వసంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

వాంకిడి: వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అటవీశాఖ అధికారులు మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ×అడవులు, వన్యప్రాణులు, వాటి ప్రాముఖ్యత× అనే అంశంపై చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. డీఆర్వో సరోజ రాణి, ఎఫ్ఎస్‌వోలు భగవంత్‌రావు, సత్యనారాయణ, అత్తరుద్దీన్, లక్ష్మణ్, ఎఫ్‌బీవోలు శ్రీవిద్య, ఉమారాణి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

పెంచికల్‌పేట్: మండలంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంగళవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రూ.94 లక్షలతో పెంచికల్‌పేట్ గ్రామ బీటీ రహదారి, బొంబాయిగూడ నుంచి ఎర్రగుట్ట గ్రామానికి రూ. 1 కోటిలతో రహదారి, ఉచ్చమల్లవాగుపైన రూ.2 కోట్లతో లోలెవల్ వంతెన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, సర్పంచ్‌లు శ్రీనివాస్, సంజీవ్, సుధాకర్, రాజన్న, కమల, కళావతి, దేవాజీ, ఈశ్వరిబాయి, ఎంపీటీసీ శారద, కోఆప్షన్ సభ్యుడు సాజీద్, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు శ్రీనివాస్, రామయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, డీఈ నిరంజన్, ఏఈ బద్రుద్దీన్, నాయకులు రాజన్న, చలం, శ్రీనివాస్, చౌదరి శ్రీనివాస్, ఎస్‌కే బాబు, బండన్న తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

బెజ్జూర్: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండలంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మర్తిడి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేసే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. మండలంలోని కుంటలమానెపల్లి -రుద్రాపూర్ రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్ల 68 లక్షలు, ఆర్అండ్‌బీ రోడ్డు, డబ్బాగూడ రోడ్డు నిర్మాణానికి రూ.97 లక్షలు, మర్తిడి నుంచి సలుగుపల్లి రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు, రంగాపూర్ రోడ్డు నిర్మాణానికి రూ.62 లక్షలు, బెజ్జూర్ నుంచి సిద్దాపూర్ రోడ్డు నిర్మాణానికి రూ.1కోటి 50 లక్షలు, సలగుపల్లి నుంచి గంగరాంగూడ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్ల 39 లక్షల పనులకు భూమిపూజ చేశారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

మండలంలోని నాగపెల్లి, తుమ్మలగూడ, బెజ్జూర్, ఎలుకపెల్లి గ్రామాల నుంచి పలువురు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. బెజ్జూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవనపల్లి సత్తయ్య, రజక సంఘం నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. జెడ్పీటీసీ పుష్పలత, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు జగ్గాగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సకారాం, కోఆప్షన్ సభ్యులు బషారత్ ఖాన్, సర్పంచ్ రవికుమార్, ఎంపీటీసీలు వెంకన్న, పర్వీన్ సుల్తానా, బీఆర్ఎస్ మండల నాయకులు వెంకన్న, నరేందర్ గౌడ్, రామకృష్ణ, జావిద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ భవనానికి భూమిపూజ

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని గన్నారం గ్రామంలో మంగళవారం ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ భవనానికి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప భూమిపూజ చేశారు. ఐటీడీఏ నిధులు రూ. 5కోట్లు మంజూరు కాగా పనులు ప్రారంభించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, నాయకులు గజ్జి రామయ్య, వాసుదేవు, ఐటీడీఏ డీఈ నిరంజన్‌రావు, ఏఈ బద్రోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి


సిర్పూర్(టి): భిక్షాటన చేస్తున్న కార్మికులు


కెరమెరి: నిరసన తెలుపుతున్న కార్మికులు

కెరమెరి: పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె కొనసాగింది. లలిత, ప్రేమల, కవిత, రజిత, రాజవ్వ, సునీత, శోభ, మెంగుబాయి, సోంబాయి, శాంతాబాయి, రాజవ్వ తదితరులు ఉన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది


వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై విక్రమ్

బెజ్జూర్: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని ఎస్సై విక్రమ్ అన్నారు. మంగళవారం మొగవెల్లి గ్రామపంచాయతీలోని గేర్రెగూడ గ్రామంలో పర్యటించిన ఆయన బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌లో యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ అనుకున్న లక్ష్యాలు నెరవేర్చుకునే దిశగా ముందుకు సాగాలని సూచించారు.

'పదిశాతం ఐఆర్ ప్రకటించాలి'



ఖిరిడిలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కాగజ్‌నగర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు 10 శాతం ఐఆర్ ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మంగళవారం కమిటీ సభ్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మూల వేతనంలో ఐదు శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించడం సరికాదని పేర్కొన్నారు. పీఆర్సీ కమిటీ నియమించడాన్ని స్వాగతిస్తున్నామని, ఆరు నెలల్లోపు నివేదిక తెప్పించి అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గత పీఆర్సీ బకాయిలు కూడా నేటికీ పూర్తిగా చెల్లించలేదని తెలిపారు.

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం కేవలం 5శాతం ఐఆర్ ప్రకటించడంపై ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు అన్నారు. వాంకిడి మండలంలోని ఖిరిడి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కనీసం 18 శాతం ఐఆర్ ప్రకటిస్తారని ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఆశాభంగం కలిగిందన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, శంకర్, గణపతి, హేమంత్, చైతన్య, రాజేందర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ఆసిఫాబాద్‌అర్బన్: అత్యవసర సమయాల్లో విధులు నిర్వర్తించే 104 ఎఫ్‌డీహెచ్‌ఎస్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 104 ఎఫ్‌డీహెచ్ఎస్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేందుకు ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే చెల్లించాలన్నారు. 104 ఏఎన్ఎంలను సెకండ్ ఏఎన్ఎంలుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని, ఆరోగ్యబీమా కల్పించాలని, అన్నిరకాల సెలవులు మంజూరు చేయాలని, డాటా ఎంట్రీ ఆపరేటర్లను కంప్యూటర్ ఆపరేటర్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

కౌటాల: మండలంలోని ముత్తంపేట ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు స్థానిక ఉపాధ్యాయురాలు సోనియా మంగళవారం ఉచితంగా స్టీల్ ప్లేట్లను పంపిణీ చేశారు. తన కుమారుడి జన్మదినం సందర్భంగా 70 మంది విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు.